క్లుప్తంగా

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి



పొలం పిలుస్తోందిలో మాట్లాడుతున్న ఏవో

నిడమర్రు: అన్నదాత సుఖీభవకు సంబంధించిన లబ్ధిదారులు త్వరితగతిన ఈకేవైసీ చేయించుకోవాలని నిడమర్రు వ్యవసాయ అధికారిణి ఇంగర్ దైవఆశీర్వాదం అన్నారు. మంగళవారం బువ్వనపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ కౌలు రైతులు రైతుసేవా కేంద్రాల వద్ద సీసీఆర్‌సీ కార్డులను తీసుకోవాలన్నారు. సార్వా సాగుకు పురుగు మందులు తగ్గించి, సేంద్రియ వ్యవసాయం పద్ధతిలో రైతులు సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో కృష్ణ, వీఏఏలు సాయిబాబా, హనుమంతు, రైతులు సంకు శ్రీను, అలుమోలు అరుణ్, సంకు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

ఇంటింటా క్యాన్సర్ సర్వే



ఇంటింటా సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటా క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే నిర్వహిస్తున్నామని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి రాకేష్ అన్నారు. మంగళవారం గోపన్నపాలెం పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వేను ఆయన పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ ప్రతి రోజూ జరిగే ఈ సర్వేలో వైద్య సిబ్బందికి గృహ యజమానులు సహకరించి, వివరాలు తెలియజేయాలని కోరారు. ఎంపీహెచ్‌ఓ సత్యనారాయణ, ఏఎన్ఎం సుభాషిణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని సంరక్షించాలి



సివిల్ సప్లై గోడౌన్‌ను ఆకస్మిక తనిఖీ చేస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

పెదవేగి: ఏలూరు జిల్లాలోని వంగూరు సివిల్ సప్లై గోడౌన్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజా పంపిణీ బియ్యాన్ని దిగుమతి చేసిన వెంటనే వాటిని సంరక్షించాలని, పురుగులు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గోడౌన్ మేనేజర్‌ను ఆదేశించారు. గోడౌన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్లకు పురుగులు లేని బియ్యాన్ని ప్రజా పంపిణీకి సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు



ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో వేంచేసియున్న అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఆలయ సత్రంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి హనుమాన్ జంక్షన్‌కు చెందిన బొమ్మి హంసిక, తనూష్ సాయి ఆర్థిక సాయం అందించారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 200 మందికి పైగా భక్తులు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.

జంగారెడ్డిగూడెం సీఐగా సుభాష్



జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సీఐగా ఎంవీ సుభాష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నిడమర్రు సర్కిల్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన సీఐ వి.కృష్ణబాబును వీఆర్‌లో ఉంచారు. కాగా సీఐ సుభాష్ మాట్లాడుతూ పట్టణంలో గంజాయి విక్రయాలు, వినియోగం, ట్రాఫిక్ సమస్యపై దృష్టిసారిస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సహకారంతో సమస్యలు పరిష్కరిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

సార్వాకు సాగునీటి కష్టాలు తీరేనా?

- వంతెనల వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు
- ముందుకు కదలని సాగు నీరు
- కాలువకు అరకొరగా నీటి విడుదల
- తూతూ మంత్రంగా అభివృద్ధి పనులు



పూళ్ల వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క



కైకరం, పూళ్ల మధ్య మరమ్మతులు చేసిన షట్టర్



పూళ్ల, కురెళ్లగూడెం మధ్య పాడైన షట్టర్

భీమడోలు: సార్వా సీజన్ ఆరంభంలో సాగునీటి కష్టాలు తప్పేటట్లులేవు. గోదావరి కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. జల వనరుల శాఖ అధికారులు కాలువలకు నీటిని అరకొరగా విడుదల చేశారు. దీని ఫలితంగా కనిష్ఠ స్థాయిలో ఉన్న సాగు నీటిని గుర్రపు డెక్క ముందుకు సాగనివ్వకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతుంది. దీని వలన సార్వా పనులు ప్రారంభించలేని పరిస్థితి ఏర్పడింది. మండల వ్యాప్తంగా పూళ్ల, పాతూరు, కురెళ్లగూడెం వంతెనల వద్ద గుర్రపు డెక్క దట్టంగా పేరుకుపోయింది. దీంతో కాలువలోని నీరు పల్లపు తూములకు సైతం పారకపోవడంతో నారు మడులు ఆలస్యమవుతున్నాయి.

లోపించిన సమన్వయం

తాడేపల్లిగూడెం, గుండుగొలను డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో గోదావరి కాలువ విస్తరించింది. అయితే కాలువలో డిస్ట్రిబ్యూటరీ కమిటీల్లోని సాగునీటి సంఘాల ప్రతినిధులు, అధికారులు చర్చించుకొని పనులపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే వారి మధ్య సమన్వయం లోపించడంతో కాలువ పనులు ప్రహసనంగా మారాయి. ఇష్టానుసారంగా పనులు చేపట్టారు. తాడేపల్లిగూడెం డీసీ పరిధి ఎటువంటి పనులు చేపట్టలేదు. గుండుగొలను డిస్ట్రిబ్యూటరీ కమిటి పరిధిలో గోదావరి కాలువ ఆధునికీకరణలో భాగంగా కర్రనాచు, గుర్రపు డెక్కలను తొలగించే పనులను హడావుడి చేపట్టి అసంతృప్తిగా ముగించారు. కాలువలు ఈ విధంగా ఉండగా తాడేపల్లిగూడెం డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో గుర్రపు డెక్క, కర్రనాచు వంటి పనులు చేపట్టనందున అసలు సమస్యకు కారణంగా మారింది. కాలువలో నీరు విడుదల చేయగానే తాడేపల్లిగూడెం పరిధిలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు కిందకు చేరి గుండుగొలను డీసీ పరిధిలోని పూళ్ల, కురెళ్లగూడెం, పాతూరు వంతెన వద్ద తిష్ట వేసింది. దీంతో సాగునీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకంగా మారింది. గుండుగొలను డీసీ పరిధిలో ఆధునికీకరణ పనులు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో గుండుగొలను ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో 35 వేల ఎకరాల పంట పొలాలకు సాగు నీరు పుష్కలంగా అందుతుందా లేదా అన్న సందేహం రైతుల్లో వ్యక్తమవుతుంది. గుర్రపు డెక్క, కర్రనాచులను వెంటనే తొలగించాలని సాగు నీటి సంఘాల ప్రతినిధులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

షట్టర్ల మరమ్మతులు జరిగేనా?

గోదావరి కాలువలో కైకరం, పూళ్ల మధ్య నంబర్–2 షట్టర్, పూళ్ల, కురెళ్లగూడెం మధ్య నంబర్–3 షట్టర్, ఆశ్రం ఆసుపత్రి సమీపంలో నంబర్–4 షట్టర్లు ఉన్నాయి. ఇది సాగునీటి వ్యవస్థకు కీలకంగా ఈ షట్టర్లను దశాబ్ధాలుగా పట్టించుకోకపోవడంతో షట్టర్లు శిథిలావస్థలకు చేరి పాడయ్యాయి. గోదావరి కాలువకు భారీ వరద నీరు చేరిన తరుణంలో గట్టు దెబ్బ తినకుండా, సాగు పొలాలకు నష్టం వాటిల్లకుండా ఈ షట్టర్ల ద్వారా నీటిని కొల్లేరులోకి విడుదల చేస్తారు. ఇంతటి కీలకంగా ఉన్న ఈ షట్టర్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో నీరు వృథాగా కొల్లేరు పరిధిలోని ఆక్వా చెరువులకు చేరుతుంది. దాళ్వాలో అరకొరగా విడుదలైన సాగునీరు పాడైన ఈ షట్టర్ల కింది భాగం నుంచి కొల్లేరులోకి వృథాగా వెళ్లడంతో నీటి ఎద్దడి ఏర్పడి రైతాంగం నానా అవస్థలు ఎదుర్కొంటుంది. అయితే గుండుగొలను డీసీ అధ్యక్షుడు గంధం లక్ష్మణ్ స్పందించి పూర్తిగా దెబ్బతిన్న నంబర్–2 షట్టర్‌ను రూ.7 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. పాడైన కింద, పైన ప్లేట్లను తొలగించి వాటి స్థానంలో నూతన ప్లేట్లు ఏర్పాటు చేయించారు. దీంతో కొంత మేరకు నీటి వృథాకు పరిష్కారం లభించింది. మిగిలిన నంబర్–3, నంబర్–4 షట్టర్లకు మరమ్మతులు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని సాగునీటి సంఘాల ప్రతినిధులు అంటున్నారు.

“ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు

గుండుగొలను సెక్షన్ పరిధిలో సాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. రెండు, మూడు రోజుల్లో నీటి ప్రవాహం పెరుగుతుంది. సాగునీటి, తాగునీటి సమస్యలు తీరుతాయి. పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడులను తొలగించాలని అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. గోదావరి కాలువలోని నంబర్–2 ఎస్కేపు వద్ద షట్టర్‌కు మరమ్మతులు చేసి శాశ్వత పరిష్కారం చూపాం. రైతులు ఆందోళన చెందొద్దు.

– గంధం లక్ష్మణ్, డిస్ట్రిబ్యూటరీ సాగునీటి సంఘం అధ్యక్షుడు, గుండుగొలను

పరిశుభ్రత పాటిస్తే రోగాలు దూరం



మలేరియా మాసోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఉంగుటూరు: దోమలు పెరగకుండా పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు, కాగుపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.మానస అన్నారు. కాగుపాడు పీహెచ్‌సీ పరిధిలోని ఉంగుటూరు–2 సచివాలయం కాలనీలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరు నిల్వ ఉండకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది సత్యనారాయణ, డి.చంద్రకళ, యు.ఎస్తేరు, ఆర్.రమాదేవి, ఎస్.గణపతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగపాలెం ఏఓగా ప్రదీప్‌కుమార్



లింగపాలెం: లింగపాలెం మండల పరిధిలో ఉన్న రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చొరవ చూపుతానని ఏఓ వి.ప్రదీప్‌కుమార్ అన్నారు. ఆయన పెదపాడు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమన్వయంతో రైతులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి రైతుకూ అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

సూపర్ సిక్స్ పేరిట చంద్రబాబు మోసం

- 'జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ
- కూటమి మోసపూరిత హామీలపై ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ నాయకులు



దెందులూరు: పుస్తకాన్ని ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: వెన్నుపోటు, మోసానికి నిలువెత్తు నిదర్శనం చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కత్తుల రవి అన్నారు. మంగళవారం దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆదేశాల మేరకు ఆయన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ దెందులూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు 'వైఎస్ జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ చేశారు. జిల్లా అధికార ప్రతినిధి కత్తుల రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కేవలం అధికారం కోసమే అమలు కాని హామీలను సూపర్ సిక్స్ పేరిట ప్రచారం చేసి ప్రజలను దగా చేశారన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయినా సూపర్ సిక్స్ హామీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. 40 ఏళ్ల అనుభవం పదేపదే చెప్పే చంద్రబాబు, కూటమి పెద్దలు నేటికీ ఎందుకు హామీలను అమలు చేయడం లేదని ప్రజలను మోసం చేయటం దగా చేయడం కాదా అని ప్రశ్నించారు. దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవ కాంతం మాట్లాడుతూ రాష్ట్రంలో కోట్లాది మంది మహిళలను నిట్ట నిలువునా కూటమి పెద్దలు ఏక కాలంలో మోసం చేశారన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కులాలు, మతాలు పార్టీలు, వర్గాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం పాలన సంవత్సరం పూర్తయినా ఉచిత బస్సు ఏ గ్రామంలోకి రాలేదని విమర్శించారు. ఆడబిడ్డ నిధి కూడా ఇవ్వటం లేదన్నారు. నిరుద్యోగ భృతి, రైతుకు సాయం ఇలా ఇచ్చిన హామీలు ఏవీ అమలు చేయలేదన్నారు. ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. దెందులూరు మండల ఉపాధ్యక్షుడు వేమూరి జితేంద్ర వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగం రాష్ట్ర నాయకులు లక్ష్మీ కుమార్, జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు, చల్ల మేరీరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు జానంపేట ప్రసాద్‌బాబు, కూరపాటి ప్రభుదేవా, తలారి రామకృష్ణ, ఎం.కృష్ణారావు, నిట్టా గంగరాజు, మున్నికుమార్, బత్రాజు సత్యనారాయణ, రమేష్, గంటా పండు, చల్లగొళ్ల తేజ, కొంగర రత్నకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పుస్తక ఆవిష్కరణ

ఉంగుటూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం పుస్తకం వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. ఉంగుటూరు మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు అధ్యక్షతన పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వైఫల్యాలను ఈ పుస్తకం ద్వారా ప్రజలకు అర్థమవుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం ద్వారా రాక్షస పాలన సాగిస్తోందని, త్వరలోనే ఈ పాలనకు ప్రజలు ముగింపు పలుకుతారన్నారు. కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు పుప్పాల గోపి, స్టేట్ బూత్‌వింగ్ సెక్రటరీ ఎలిసెట్టి పాపారావు బాబ్జి, స్టేట్ మహిళా ప్రధాన కార్యదర్శి మంద జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంటా శ్రీలక్ష్మి, కోరిపల్లి జయలక్ష్మి శ్రీనివాసరావు, పుచ్చకాయల విష్ణుమూర్తి, బంగారు నాగరాజు, సూరె వెంకటలక్ష్మి, ఏడుకొండలు పాల్గొన్నారు.

కూటమి అబద్ధపు హామీలకు ఏడాది

భీమడోలు: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో హామీలను తుంగలోకి తొక్కి ప్రజలను నట్టేట ముంచిందని భీమడోలు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్ అన్నారు. భీమడోలు సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్ క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం వైఎస్సార్‌సీపీ రూపొందించిన కూటమి ప్రభుత్వ ఏడాది పాల న వైఫల్యాలపై ముద్రించిన 'జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ మాట్లాడుతూ మోసపూరిత హామీలతో గద్దె నెక్కడం చంద్రబాబు నైజమని, ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పించి ప్రజలను ప్రలోభ పెట్టి అధికారంలోకి వచ్చిన మోసకారి అన్నారు. కూటమి ఏడాది పాలనను దుమ్మెత్తి పోస్తున్న ప్రజలను శాంతింపచేసేందుకు అరకొరగా పథకాలను అమలు చేసి చేతులు దులుపుకున్నారు. యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మద్దుల రాజా మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు ఏడాదికి 5 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి గద్దెనెక్కిన తరువాత లక్షలాది ఉద్యోగాలు తొలగించి వారిని నిరుద్యోగులుగా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు, జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు తుమ్మగుంట రంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీలకు మేలు చేసే ఒక్క కార్యక్రమం చేపట్టలేదన్నారు. సమావేశంలో ఎంపీటీసీ ఆళ్తి గోపి, మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు, పలు అనుబంధ విభాగాల నియోజకవర్గ కన్వీనర్లు ఆళ్తి శ్రీనివాస్, పాము మాన్‌సింగ్, అంబటి నాగేంద్ర ప్రసాద్, రామిశెట్టి శ్రీను, నాయకులు ఆళ్తి సురేష్, బి.రమేష్, సకల గోవింద్, కె.రవి, సవలం పండు, అడబాల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



ఉంగుటూరు: పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు



భీమడోలు: పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వైభవంగా సత్యసాయి రథయాత్ర



సత్యసాయి రథయాత్రకు స్వాగతం పలుకున్న భజన మండలి కన్వీనర్ సూర్యనారాయణ

పెదపాడు: దేవుని సేవతో పాటు సత్యసాయి సేవలను మరింతగా విస్తృత పరచాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశిశేఖర రావు తెలిపారు. మండలంలోని పెదపాడులో సత్యసాయి ప్రేమ రథయాత్ర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏలూరు నుంచి పెదపాడుకు విచ్చేసిన సత్యసాయి ప్రేమ రథయాత్రకు పెదపాడులోని పాలకేంద్రం వద్ద పెదపాడు భజన మండలి కన్వీనర్ కరెడ్ల సూర్యనారాయణ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పాలకేంద్రం వద్ద నుంచి షిర్డిసాయి ధ్యాన మందిరం వరకు నగర సంకీర్తన చేశారు. అనంతరం పెదపాడు నుంచి పాత పెదపాడు, రాజుపేట మీదుగా రథయాత్ర ముందుకు సాగింది. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు ఎం.ధర్మారావు, కె.వెంకటేశ్వరావు, పి.రామారావు, సోడిశెట్టి శాంతకుమార్, జి.రగునాథబాబు, చిన్నం రాజు, కాట్రం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక అభివృద్ధి



గణపవరం: విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్



భీమడోలు: చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న సర్పంచ్

గణపవరం: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలని సర్పంచ్ మూర అలంకారం, మానవత రీజియన్ చైర్మన్ కాకర్ల వినాయక అన్నారు. మంగళవారం గణపవరంలోని నంబర్–1 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంఎల్ఎస్ నారాయణ ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత స్థానానికి చేరుకోగలం

భీమడోలు: చదువుతోనే ఉన్నత స్థానానికి చేరుకోగలమని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం అన్నారు. పోలసానిపల్లి నంబర్–1 పాఠశాలలో మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం కె.తులసి అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ షేక్ రహీమా బేగం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దలు గంజి సుబ్బారావు, మద్దు శ్రీను, టీచర్ మంగతయారు, ఎస్ఎంసీ చైర్మన్ కోట వీర వెంకట దుర్గ, ఉపాధ్యక్షుడు కె.సీతయ్య, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీదుర్గ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యోగాసనాలతో ఏకాగ్రత మెండు



గణపవరం: డిగ్రీ కాలేజీలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



దెందులూరు: యోగా చేస్తున్న విద్యార్థులు

గణపవరం: విద్యార్థులు ప్రతి రోజూ యోగాసనాలు వేయడం వలన వారిలో ఏకాగ్రత పెరిగి విద్యాపరంగా ముందంజలో ఉంటారని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ నిర్మలకుమారి అన్నారు. మంగళవారం కాలేజీలో ఎన్ఎస్ఎస్–1, 2 యూనిట్ల ఆధ్వర్యంలో యోగాంధ్ర 2025లో భాగంగా విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.స్వరూపరాణి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్లు జి.వెంకటరమణ, గణేష్ కుమార్, ఐక్యు ఏసీ కో–ఆర్డినేటర్ చైతన్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా నిరంతర ప్రక్రియ కావాలి

దెందులూరు: యోగా ప్రతి ఒక్కరికీ అనుదిన జీవన విధానంలో భాగం కావాలని ఎంఈఓ ఏవీఎస్వీ ప్రసాద్ అన్నారు. మంగళవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జి.శర్మ ఫిజికల్ డైరెక్టర్ జక్కుల సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులు పలు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ యోగాతో మానసిక శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు



వివాదాస్పద స్థలంలో పూడుకుపోయిన డ్రెయినేజీ

ద్వారకాతిరుమల: భీమడోలులోని స్టేట్ బ్యాంకు ఎదురుగా ద్వారకాతిరుమల మండలం ద్వారకానగర్ పరిధిలో రోడ్డు పక్కన ఉన్న డ్రెయినేజీని ఓ వ్యక్తి పూడ్చి వేసి, అక్కడ నిర్మాణాలు చేపట్టడం వివాదాస్పదమైంది. స్థానికుల కథనం ప్రకారం. భీమడోలు జంక్షన్ మీదుగా పారే వర్షపు నీరు, అలాగే ఆ ప్రాంతంలోని ఇళ్లలోంచి వచ్చే వాడకం నీరు, స్టేట్ బ్యాంకు వెనుక ఉన్న కాలనీ నుంచి వచ్చే వాడకం, వర్షపు నీరు ఈ డ్రెయినేజీలోనే కలుస్తాయి. ఆ నీరంతా దిగువ ప్రాంతానికి పారుతుంది. అయితే ఒక వ్యక్తి డ్రెయినేజీని పూడ్చి వేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నాడని, దీంతో వాడకం, వర్షపు నీరు దిగువ ప్రాంతానికి పారే వీలు లేకుండా పోతుందని భీమడోలుకు చెందిన ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం కార్యదర్శి ముల్లగేరి జాన్సన్ తెలిపారు. వెంటనే ఈ అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని స్థానిక పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌లో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. దీనిపై పంచాయితీ కార్యదర్శి బాలామణిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

ఆలయానికి విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: స్థానిక తాడేపల్లిగూడెం రోడ్డులో నిర్మిస్తోన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి మంగళవారం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెంకు చెందిన యలమాటి వెంకట రాయుడు, రమాదేవి దంపతులు రూ.1,01,116 విరాళం చెక్కురూపంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తాడికొండ మురళీకృష్ణకు అందజేశారు. దాతలను అర్చకుడు అనిపెద్ది నరసింహశర్మమూర్తి ఆధ్వర్యంలో సత్కరించారు.

కొల్లేరు ప్రజలకు జీవన భద్రత కల్పించాలి

దెందులూరు: సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తూ కొల్లేరు పరిరక్షణకు, ప్రజల జీవన విధానానికి పూర్తిస్థాయి భద్రత భవిష్యత్తు కల్పించాలని వైఎస్సార్ సీపీ కొల్లేరు బీసీ సంఘం రాష్ట్ర నాయకులు మోరు రామరాజు అన్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. జిరాయితీ భూముల రైతులకు జరిగిన నష్టం నేపథ్యంలో 20 ఏళ్ల నుంచి పరిహారం అందజేయాలన్నారు. కొల్లేరులో సాంప్రదాయ వృత్తి చేపల సాగుపై ఆధారపడి ప్రజలు జీవిస్తున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని కోరారు. పక్షుల జీవనంతో పాటు లక్షలాది మంది కొల్లేరు వాసుల జీవన్మరణ సమస్యగా ఉన్న చేపల సాగు వృత్తిని కాపాడేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న కొల్లేరు ఫారెస్ట్ అధికారులు అవలంబిస్తున్న విధానం కొల్లేరు జిరాయితీ రైతులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. కొల్లేరులో మొత్తం 77,000 భూమి ఉండగా, జిరాయితీ భూమి 14,750 ఎకరాలు ఉందని, వారికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.